**ఆమె విరగకాచిన యౌవనంలా వుంది. తెల్లని చీర కట్టుకుంది. మల్లెపూలు పెట్టుకుంది.**

ఒంటికి తూనీగ రెక్కలు తగిలించుకుంది.

పెదవుల మీద చిరునగవులు మొలకెత్తాయి.

కళ్లల్లో మెరుపుల జల్లులు కురుస్తున్నాయి.

గదిలోంచి వరండాలోకి... వరండాలోంచి గదిలోకి-

మళ్లీ మళ్లీ తిరుగుతోంది.

అభిసారికలా అతడికోసం ఎదురుచూస్తోంది.

ఏదో పాట మధ్యమధ్య హమ్ చేస్తోంది.

కాళ్లు నేల మీద ఆనటం లేదు.

# కల్పన

## శృంగార విధి

### సింహప్రసాద్



అతడొచ్చినట్టు, వాటేసుకున్నట్టు, ఏదేదో చేసినట్టు పిచ్చివూహలు.

కాదు కాదు పచ్చివూహలు. పసిడికోర్కెలు.

అతడొచ్చాడు.

శోభనపు పెళ్లికూతుర్లా వున్న ఆమెని చూశాడు.

క్షణకాలం బిత్తరపోయాడు. ఆ ఉత్తరక్షణాన మరిచిపోయాడు.

మంచి నీళ్ల గ్లాసందిస్తూ వెన్నెల్లా నవ్వింది.

అతడి ముఖంలో ప్రతిస్పందన కరువయ్యింది.

"ఏవిటలా వున్నారు?"

"ఈ వెధవ వుద్యోగం చెయ్యలేకఛస్తున్నాను!"

"పోనీ ఇంకోటి చూసుకుంటే?"

"తలక్రిందులుగా తపస్సు చేసినా ఎవ్వడూ ఇవ్వడు!"

"మరైతే ఎడ్జస్టయిపోవటమే బెటర్ కదా!"

వెర్రిగా చూశాడు.

సమీపించి అతడి భుజం మీద గెడ్డం ఆన్చి మత్తుగా చూసింది.

"అందిన దానిలో ఆనందం చూసుకోవడం, ఆనందం జుర్రుకోవడం మంచిది."

"అది చేతకాకే కదా ఈ తిప్పలు! నేను అందర్లాటి వాణ్ణి కాదు!" ఆమెని విదిలించి బాత్రూంలోకి దూరాడు.

'ఆ సంగతి ఇన్నాళ్ల నుంచీ చూస్తూనేవున్నాను కదా!' అనుకుందామె.

"వేడినీళ్లు పెట్టావు. ఏమిటి విశేషం?" లోపల్నుంచి అరిచాడు.

"చెప్పుకోండి చూద్దాం!"

"పజిల్స్ నాకు అనిష్టం."

అరచేత్తో నుదురు కొట్టుకోబోతూ ఆగింది.

వేడివేడి అన్నం, కూర. బావుందంటూ గబగబా తినేశాడు.

ఆమె తినటం పూర్తి కాలేదు.

అతడ గదిలోకెళ్లిపోయాడు.

త్వరగా భోజనం ముగించి కంచాలు సింకులో పడేసింది. వాటిని కడుగుతూ కూచుంటే గదిలోంచి 'గుర్రు' వినిపిస్తుందని తెలుసు. అందుకే చేతులు కడుక్కుని వచ్చేసింది.

నిలువుటద్దంలో చూసుకుంటూ చీర, పూలు సరిచేసుకుంటూ ఓరగా అతడ్ని చూసింది.

దినపత్రిక తిరగేస్తున్నాడు.

'హమ్మయ్య!' అనుకుంది. మంచం మీదకి అతడి పక్కకి చేరింది.

అతడు చూళ్లేదు. పట్టించుకోనూ లేదు.

గోడకి వేలాడుతోన్న మాధురీదీక్షిత్ నవ్వుతోంది. ఊర్మిళ కవ్విస్తోంది. రంభ పెదవి కొరుకుతోంది.

అతళ్లో మాత్రం చలనం లేదు. పేపర్ పక్కన పడేశాడు.

ఆమె గుండె వేగంహెచ్చింది.

అతడిప్పుడు బాత్రూం కెళ్తాడు. వస్తాడు. పడుకుంటాడు. అరక్షణంలో గుర్రు కొడతాడు.

నిట్టూర్చబోయి ఆగింది.

**ఇవాళ కథని మార్చి తీరాలి!**

మధ్యాహ్నం చదివిన పుస్తకంలోని ఓ డాక్టర్‌గారి జవాబు గుర్తు తెచ్చుకుంది.

బెడ్ మీద స్వీట్ నథింగ్స్ చెప్పుకోవాలి. కొండొకచో ఫాంటసీని ఆవిష్కరించుకోవాలి. అలా చేస్తే ఎలాంటి శిలకైనా చైతన్యం వస్తుందిట! ఎలాటి శరీరమైనా శ్రుతి చేయబడుతుందిట! ఆ సూత్రమే ప్రయోగింపదలిచిందామె.

బాత్రూం నుంచొచ్చి మంచం మీద మేను వాల్చాడతడు.

"పక్క అపార్ట్‌మెంట్లో గొడవగా, గోలగా వుంది విన్నారా?"

"వాళ్ల గోల మనకెందుకు లెద్దూ?"

"అది కాదండీ! ..."

"ష్.. నిద్రొస్తోంది."

"అక్కడేం జరుగుతోందో తెలిస్తే మీకు నిద్ర రాదు!"

ఆమె వైపు తిరిగి ఆశ్చర్యంగా చూశాడు.

నవ్వుకుంది. ఊరించాలనుకుంది. "మీకు వినిపించట్లేదేమో కాని, నాకు వినిపిస్తున్నాయి."

"ఏవిటి?"

"పాముల బుసబుసలు!"

"పాములేవిటి?"

"రెండు తనువులొక్కటయ్యే సంగమకార్యక్రమం."

"నాకేం అర్థం కావటం లేదు."

"పోనీ లెండయితే!"

"అర్థమయ్యేట్లు చెప్పొచ్చుగా!"

"మీకు నిద్ర తప్ప ఇంకేమీ అక్కర్లేదు కదా!"

"మాట మార్చకు! ఏం జరుగుతోందో చెప్పు!"

"శోభనం!"

"ఎ.. ఎవరికి?"

"కొత్తగా పెళ్లయిన జంటకి."

"పెళ్లెప్పుడయింది?"

"ఏమో మరి! పక్క అపార్ట్‌మెంటు వారి బంధువులు. ఎంచేతో శోభనం ఇక్కడ ఏర్పాటు

చేశారు."

"నిజంవా?"

"అవును. అన్నీ ఏర్పాటు చేసి అపార్టుమెంటు వారికి అప్పగించి వెళ్లిపోయారంతా."

అతడి మొహంలో రంగులు మారుతున్నాయి.



ఒంట్లోని రక్తపు పరుగు ఆమెకి తెలుస్తూనే వుంది.

"అయితే వాళ్లిద్దరూ..."

"ఇదిగో, ఈ గోడకి ఆవల స్వర్గాన్ని భూమి మీదకి దించాలని ప్రయత్నిస్తున్నారు."

అతడికి తన శోభనపు రాత్రి గుర్తొచ్చింది. ఆమె వంక చూశాడు.

ఆ నాటికన్నా యౌవనపు పొంగుల్తో మిసమిసలాడ్తోంది. ఆమె తప్ప మరేమీ కనిపించనట్టుగా చూశాడు. ఉత్తరక్షణాన వాటేసుకున్నాడు.

వారించబోయినట్టు నటించింది.

అతడింకా రెచ్చిపోయాడు. అల్లుకుపోయాడు. జలపాతంలా మారిపోయాడు.

జలపాతంలో నిలువునా మునిగిపోతూ "థాంక్యూ డాక్టర్!" అని గొణుక్కుందామె.

ఆమె పేరు కలువ. అతడి పేరు సత్యం. ■